

# కొనసాగుతున్న అల్పపీడనం

## డిసెంబరు 15 వరకు మోస్తరు వర్షాలు

**అమరావతి:** ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ తెలిపింది. బుధవారం నాటికి శ్రీలంక-తమిళనాడు తీరాలకు చేరే అవకాశం ఉంది. దీని ప్రభావంతో డిసెంబరు 15 వరకు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ సూచించింది.

# నోటీసు ఇస్తేనే విచారణకు వస్తా


### ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి



**అమరావతి:** సోషల్ మీడియా కేసులో విచారణకు రావాలని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఇంటికి పోలీసులు వెళ్లారు. వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డి కేసులో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవరెడ్డి నెల రోజులుగా పరారీలో ఉన్నాడు. కడప కోర్టులో ముందస్తు బెయిల్‌కోసం పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు కొట్టేసింది. ఆ తర్వాత హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 12 వరకు రాఘవరెడ్డిని అరెస్టు చేయవద్దని విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నిందితుడు రాఘవరెడ్డి ఆదివారం పులివెందులలో ప్రత్యక్షమయ్యాడు. విషయం తెలుసుకున్న పులివెందుల పోలీసులు.. విచారణకు రావాలని అతడి ఇంటికి వెళ్లారు. మౌఖికంగా చెబితే రానని, నోటీసు ఇస్తేనే విచారణకు వస్తానని రాఘవరెడ్డి పోలీసులకు చెప్పినట్టు సమాచారం. ఎలాంటి చర్యలు తీసుకోము.. విచారణకు సహకరించాలని పోలీసులు పలుమార్లు కోరినా రాఘవరెడ్డి మాత్రం నోటీసు ఇస్తేనే విచారణకు వస్తానని స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లారు. ప్రస్తుతం వర్రా రవీందర్‌రెడ్డి కేసులో పవన్ కుమార్‌ని డీఎస్పీ మురళీ ప్రశ్నిస్తున్నారు.

# వాట్సప్‌లో కొత్త ఫీచర్..

### మరిచిపోయిన మెసేజ్‌లను గుర్తుచేసేలా..




చిన్న సందేశం పంపాలన్నా, ఫొటోలు, వీడియోలు షేర్ చేయాలన్నా వెంటనే గుర్తుకు వచ్చేది వాట్సప్. దీంతో పెద్ద ఎత్తున సందేశాలు వచ్చి చేరుతుంటాయి. వాటిలో ముఖ్యమైన వాటిని చూసేసి.. మిగిలినవి మరీ చూద్దాం అనుకుంటూ అలానే వదిలేస్తాం. దీంతో కొన్ని చాట్‌లు మరుగునపడిపోతుంటాయ్. అలా వదిలేసిన చాట్‌లను రిమైండ్ చేయాలనే ఉద్దేశంతో వాట్సప్ కొత్త ఫీచర్‌ను తీసుకురానుంది. ఈ విషయాన్ని వాబీటా ఇన్ఫో తన బ్లాగ్ పోస్ట్‌లో వెల్లడించింది. వాట్సప్‌లో రానున్న కొత్త ఫీచర్ మెసేజ్ రిమైండర్. అప్లికేషన్‌లో చదవకుండా వదిలేసిన సందేశాల్ని ఇది గుర్తు చేస్తుంది. అయితే గతంలో స్టేటస్ అప్‌డేట్లను రిమైండింగ్ కోసం మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఫీచర్.. తాజాగా చాట్‌లలో చదవని సందేశాలకు ట్రాక్ చేయడంలో మీకు సాయం చేస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ పరీక్ష దశలో భాగంగా ఎంపిక చేసిన వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలోనే అందరికీ అందుబాటులోకి రానుంది. లైవ్‌లోకి రాగానే Settings > Notifications > Remindersని ఎంచుకొని ఈ ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. అన్ని కాంటాక్ట్‌లను సంబంధించి నోటిఫికేషన్ వస్తుందా, లేదా? అనే విషయం తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



**ఘట్కేసర్, డిసెంబర్ 8 (నేటి ప్రస్థానం) :** ఘట్కేసర్ మునిసిపాలిటీ పరిధిలోని నారాయణ గార్డెన్ లో ఆదివారం కళ్యాణ లక్ష్మీ,షాధి ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మాల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, బొడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,పీర్జాది గూడ మేయర్ అమర్ సింగ్, ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, ముఖ్యఅతిథిగా హాజరైనారు. అనంతరం మేడ్చల్ నియోజకవర్గం లోని ఘట్కేసర్, కీసర,



మేడిపల్లి మండలలకు సుమారు 407 కల్యాణలక్ష్మీ,షాధి ముబారక్ మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రరెడ్డి,వైస్ చైర్మన్ బండారు మలేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,కీసర ఆర్డీవో సైదులు,ఎమ్మార్వో అశోక్, ఆర్.ఐ విశ్వనాథం, జూనియర్ అసిస్టెంట్ రాజు, బి.బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సువెన్ ఫార్మా చేతికి ఎన్‌జే బయో




**హైదరాబాద్:** యూఎస్‌లోని ప్రిన్స్‌టన్, న్యూజెర్సీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఎన్‌జే బయో ఇంక్., అనే సంస్థను సువెన్ ఫార్మాసూటికల్స్ సొంతం చేసుకోనుంది. ఈ సంస్థలో 56 శాతం వాటాను 64.4 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.545 కోట్లు) కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు కంపెనీ శనివారమిక్కడ వెల్లడించింది. ఎన్‌జే బయోను సొంతం చేసుకోవడం వల్ల సీఆర్‌డీఎంఓ (కాంట్రాక్టు రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్)లో అగ్రస్థానానికి చేరుకోవడానికి, ఏడీసీ (యాంటీబాడీ డ్రగ్ కంజుగేట్స్) ఔషధాలు ఆవిష్కరించడా నికి అవకాశం లభిస్తుందని సువెన్ ఫార్మా పేర్కొంది. ఎన్‌జే బయోను నరేష్‌కుమార్ జైన్ స్థాపించారు. బోస్టన్ యూనివర్సిటీలో పీహెచ్‌డీబీద స్క్రిప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, కాలిఫోర్నియాలో పీడీఎఫ్ చేసిన ఆయనకు మెడిసినల్ కెమిస్ట్రీలో 25 ఏళ్ల అనుభవం ఉంది. ఎన్‌జే బయోలో మెజార్టీ వాటా సువెన్ ఫార్మా చేతికి వచ్చినప్పటికీ, నరేష్‌కుమార్ జైన్ వచ్చే అయిదేళ్ల పాటు ఎన్‌జే బయో సీఈఓగా కొనసాగుతారు. ఈ సంస్థలో మిగిలిన వాటా ను అయిదేళ్ల తర్వాత కొనుగోలు చేసే అవకాశం సువెన్ ఫార్మాకు ఉంటుంది.



# సీఆర్డీఏ భవనం డిజైన్లలో 4వ ఆప్షన్‌కు అత్యధిక ఓట్లు

**అమరావతి :** రాష్ట్ర రాజధాని అమరావతిలోని ఏపీ సీఆర్డీఏ భవనం ఎలా ఉండాలనే దానిపై నిర్వహించిన అభిప్రాయ సేకరణకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఆన్‌లైన్ విధానంలో సీఆర్డీఏ వెబ్సైట్ ద్వారా ఓటింగ్ నిర్వహించగా వారం రోజుల గడువులో 9,756 మంది పాల్గొన్నారు. ప్రతిపాదిత డిజైన్‌లలో ఆప్షన్ 4కు అత్యధికంగా 3,354 మంది ఓటు వేసి మద్దతు తెలిపారు. 3,279 ఓట్లతో ఆప్షన్ 10 రెండో స్థానంలో నిలిచింది. డిజైన్లను, ఫలితాలను అధికారులు సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

# తిరిగొచ్చిన ఎఫ్‌పీఐల పెట్టుబడులు..

### మొదటి వారంలో మార్కెట్లోకి 24,454 కోట్లు



గత రెండు నెలల నుంచి దేశీయ మార్కెట్ నుంచి పెద్ద ఎత్తున నిధుల్ని వెనక్కి తీసుకున్న విదేశీ మదుపర్లు డిసెంబర్ ప్రారంభం నుంచి నికర కొనుగోలు దారులుగా నిలిచారు. డిసెంబర్ మొదటి వారంలో మొత్తం రూ.24,453 కోట్లను దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు కాస్త స్థిరంగా ఉండటం, అమెరికా ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాల మధ్య ఈ ఎఫ్ఐఈలు దేశీయ మార్కెట్‌లో తిరిగి పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. నవంబర్ నెలలో అమ్మకాలతో హడలెత్తించిన విదేశీ పోర్ట్ ఫోలియో మదుపర్లు.. చాలా రోజుల తర్వాత కొనుగోలుదారులుగా మారారు. నవంబర్ చివరల్లో మెల్లగా కొనుగోళ్లకు దిగిన ఎఫ్‌పీఐలు డిసెంబర్‌లో నికర కొనుగోలుదారులుగా నిలిచారు. ఇది దేశీయ ఆర్థిక అవకాశాలపై పెరుగుతున్న విశ్వాసాన్ని చూపుతోంది. సెప్టెంబర్‌లో రూ.57,724 కోట్ల నిధుల్ని మార్కెట్లోకి తీసుకొచ్చిన ఎఫ్‌పీఐలు, అక్టోబర్‌లో రూ.94,017 కోట్లను మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు. నవంబర్‌లో నికరంగా రూ.21,612 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఎఫ్ఐఐల కొనుగోళ్లు క్రమంగా పుంజుకొనే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



# టిప్పర్ లారీ ఢీకొని ముగ్గురి మృతి

**బాపట్ల :** బాపట్ల జిల్లా పర్చూరు - చిలకలూరిపేట రహదారి రక్తమోడింది. పర్చూరు మండలం అన్నం బోట్లవారిపాలెం సమీపంలో ద్విచక్రవాహనాన్ని మట్టిలోడుతో వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అత్త, అల్లుడు, కుమార్తె మృతి చెందారు. మృతులు మేదరమెట్ల వాసులుగా గుర్తించారు. చీరాల మండలం వాడరేవుకు సముద్రస్నానానికి వచ్చి ముగ్గురూ తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో అన్నంబోట్లవారిపాలెం సమీపంలోకి వచ్చేసరికి రహదారి పనులు చేస్తున్న మట్టి టిప్పరు, స్కూటీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్ మస్తాన్ వలి(30), షేక్ అమీరున్ (20) దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మార్టూరు మండలం కోనంకికి చెందిన అత్త షేక్ చిన బుడెమ్మ(40)ను చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పర్చూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యువతిపై ప్రేమోన్మాది దాడి



**వేముల :** ప్రేమోన్మాది దాడిలో యువతి తీవ్రంగా గాయపడిన ఘటన వైఎస్సార్ జిల్లా వేముల మండలం వి.కొత్తపల్లెలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన భాస్కర్ కుమార్తె షర్మిల(18) ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంటిదగ్గర ఉంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన కుళ్లాయప్ప అనే యువకుడు ప్రేమించాలంటూ ఆమె వెంట పడుతున్నాడు. దీనికి యువతి ఒప్పుకోలేదు. శనివారం సాయంత్రం షర్మిల ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన కుళ్లాయప్ప.. ఆమెపై కత్తితో దాడి చేశాడు. శరీరంపై 13సార్లు పొడిచాడు. యువతి కేకలు వేయగా, చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో నిందితుడు పారిపోయాడు. తల్లిదండ్రులు వెంటనే కుమార్తెను పులివెందుల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకు తిరుపతి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

